క్లుప్తంగా

అన్నిరంగాల్లో రాణించాలి



నర్మెట : చదువుతోపాటు అన్నిరంగాల్లో రాణించాలని డీసీసీ ఉపాధ్యక్షుడు గంగం నర్సింహారెడ్డి అన్నారు. ఆదివారం స్థానికంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో హన్మంతాపూర్ ఉన్నత పాఠశాల కబడ్డీ క్రీడాకారులకు దుస్తులు పంపిణీ చేసి మాట్లాడారు. అనంతరం క్రీడాకారుడు మాలోత్ అరుణ్‌ని సన్మానించారు. కార్యక్రమంలో కబడ్డీ అసోసియేషన్ జాయింట్ జిల్లా సెక్రటరీ తేజావత్ మోహన్, మండల అధ్యక్షుడు ప్రజ్ఞాపురం శ్రీధర్, పీఏసీఎస్ డైరెక్టర్ కూకట్ల చంద్రమౌళి, జాతీయ కబడ్డీ క్రీడాకారుడు నేతావత్ సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

దుప్పట్ల పంపిణీ



కొడకండ్ల : మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలకు చెందిన 100 మంది విద్యార్థులకు లయన్స్‌క్లబ్ ఆఫ్ నల్లగొండ లైట్ ఆధ్వర్యంలో ఆదివారం దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నల్లగొండ లైట్ అధ్యక్షుడు తుమ్మల గోవింద్‌రెడ్డి, కార్యదర్శి కిరణ్‌కుమార్, కోశాధికారి శ్రీనివాస్‌రెడ్డి, చంద్రశేఖర్, ప్రిన్సిపాల్ భానుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం



కొడకండ్ల : మండలంలోని పాకాల గ్రామంలో ఆదివారం ఉచిత వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పాకాల అలయ్‌బలయ్ నిర్వాహకులు జిలుకర రవికుమార్, సోమయ్య, సుధాకర్, ప్రకాశ్, శ్రీను, స్వామిదాస్ ప్రారంభించి మాట్లాడారు. డాక్టర్లు సుమంత్‌రెడ్డి, శివాని వైద్యబృందం పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు.

మత్తు పదార్థాలు విక్రయిస్తే కఠిన చర్యలు



దేవరుప్పుల : మత్తు పదార్థాలు విక్రయిస్తే కఠిన చర్యలు ఉంటాయని ఎస్సై ఊర సృజన్ కుమార్ అన్నారు. ఆదివారం రాత్రి మండల కేంద్రంలోని పలు పాన్ షాపులను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ..నిషేధిత మత్తు పదార్థాలు అమ్మినట్లయితే చర్యలు తీసుకుంటామన్నారు. యువత పెడదారిన పడకుండా వ్యాపారస్తులు సహకరించాలన్నారు. మత్తుపదార్థాలు విక్రయించినా, కొనుగోలు చేసినా చర్యలు తప్పవని ఎస్సై హెచ్చరించారు. ఆయన వెంట ఏఎస్సై సదానందం, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

కొంగుబంగారం..రామలింగేశ్వరుడు

- కాకతీయుల కాలంలో గుడి నిర్మాణం
- కార్తీక మాసంలో మూడు రోజుల పాటు ఉత్సవాలు



బండనాగారంలోని రామలింగేశ్వరాలయం (ఇన్‌సెట్‌లో) శివలింగం

బచ్చన్నపేట : కాకతీయుల కాలంలో భారీ రాతితో నిర్మించిన శ్రీ రామలింగేశ్వరాలయం మండలంలోని బండనాగారంలో కొలువై ఉంది. ఆలయంలో రాతితో చెక్కిన శివలింగం, ఆలయం ఎదుట పెద్ద నంది, ఆంజనేయ స్వామి, గణపతి, పార్వతి దేవి విగ్రహాలు రాతితో చెక్కి ఉంటాయి. కాకతీయుల కాలంలో గణపతి దేవుడు ఈ ఆలయానికి వచ్చి వెళ్లేవారట. ఆలయ నిర్మాణానికి విగ్రహాలను, ధ్వజ స్తంభాలను ఆలయ పరుపు బండపై నుంచే తీసిన ఆనవాళ్లు ఇప్పటికి ఉన్నాయి. రామలింగేశ్వర ఆలయం నుంచి కొడవటూరు సిద్దుల గుట్టకు, కొన్నె గ్రామంలో గజగిరి గుట్టకు, కొలనుపాకలోని సోమేశ్వరాలయం వరకు సొరంగ మార్గాలు కూడా ఉన్నాయి. ఈ ఆలయం చుట్టూ రెండు కిలోమీటర్ల మేర శివాలయాలు ఉన్నాయి. నాడు జరిగిన రాజుల యుద్ధాల్లో గజస్తంభం కూడా విరిగి ఉంది. నిత్యం పూజలతో రామలింగేశ్వరుడు భక్తుల కొంగు బంగారంలా విరాజిల్లుతున్నాడు.

కాకతీయ వంశస్తులు శావ మోసేవారు..

ప్రతి ఏటా కార్తీక మాసంలో మూడు రోజుల పాటు ఉత్సవాలు జరుగుతాయి. ఆ రోజుల్లో దేవుడి శావను ఊరిలో తిప్పినపుడు కాకతీయ వంశస్తులు ఒకరు వచ్చేవారని శావ మోసేవారని గ్రామస్తులు తెలిపారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు

కార్తీక పౌర్ణమిని పురస్కరించుకొని రామలింగేశ్వరాలయంలో ఉదయం గణపతి పూజలతో ప్రారంభమై, శివరుద్రాభిషేకం, బిల్వార్చన, లక్ష్మినర్సింహస్వామి వారికి పూలాభిషేకం, శ్రీరామహోమం, అన్నదానం, రాత్రిపూట శివపార్వతుల కల్యాణం, పార్వతీ అమ్మవారికి ఒడిబియ్యం, ఆలయం చుట్టూ శావ తీయుట ఉంటాయి. అలాగే రాత్రి వేళ భజన, ఒగ్గు కథలు, పలు పురాణ కథల కార్యక్రమాలు కాలక్షేపం కోసం నిర్వహిస్తారు. అనేకమంది జాగారం ఉంటారు. ప్రత్యేక పూజలు చేసి చల్లంగా చూడమని వేడుకుంటారు.

రోగాలు నయమవుతాయి



ఆలయంలో ఇప్పటికి ఒక పెద్ద నాగు పాము ఉంది. రోజూ పూజ చేయడానికి వెళ్లినపుడు పాము బయటకు వెళ్తుంది. పాలు పోసి వస్తే వచ్చి తాగుతుంది. రామలింగేశ్వరుడిని మొక్కితే నయం కాని రోగాలు కూడా తగ్గుతాయి. దైవదర్శనానికి అధిక సంఖ్యలో భక్తులు వచ్చి వెళ్తుంటారు.

– జంగిలి అంజనేయులు, అర్చకుడు

బండపై ఓంకారం వినిపిస్తుంది



బండపై కూర్చుని నిశబ్దంగా వింటే ఓంకార నాదం వినిపిస్తుంది. గ్రామంలో ఏ ఇంట్లో శుభకార్యం జరిగినా రామలింగేశ్వరుడికి మొక్కి ప్రారంభిస్తారు. ఆలయ గుండంలో స్నానం చేస్తే చర్మ వ్యాధులు తగ్గుతాయి. ఆ నీటిని పంట పొలాల్లో చల్లితే చీడపీడలు ఆశించవని ప్రజల నమ్మకం.

– కొప్పరపు రాజేంద్రప్రసాద్, స్థానికుడు

పకడ్బందీగా సర్వే నిర్వహించాలి



పాలకుర్తి: సర్వేను పరిశీలిస్తున్న పింకేష్ కుమార్



బచ్చన్నపేట: సర్వేను పరిశీలిస్తున్న రామారావు



జఫర్‌గఢ్: కూనూర్‌లో..

- అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్

పాలకుర్తి టౌన్ : కులగణన సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్ సూచించారు. మండల కేంద్రంలోని తొర్రూరు(జె) గ్రామంలో ఆదివారం కులగణన ఇంటింటి సర్వేను ఆయన సందర్శించి పరిశీలించారు. సర్వేలో ఎలాంటి అనుమానాలు వచ్చిన సూచనలు సలహాలు తీసుకోవాలన్నారు. ప్రతి ఇంటిని సర్వే చేయాలని, సర్వేలో ఉమ్మడి కుటుంబాలను గుర్తించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రాములు, ఎంఈఓ పోతుగంటి నర్సయ్య, మాస్టర్ ట్రెయినర్ సూర్య ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలు అందించేందుకే సర్వే

చిల్పూరు: అర్హులైన ప్రతీ ఒక్కరికి ప్రభుత్వం నుంచి పథకాలు అందించేందుకే ఇంటింటి సమగ్ర సర్వే చేపడుతున్నట్లు డీటీ మందడం రామారావు తెలిపారు. మండలంలోని మల్కాపూర్‌లో ఆదివారం ఇంటింటి సర్వే నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో వరుణ్, రాజిరెడ్డి, కింగర్ల మల్లేషం తదితరులు ఉన్నారు.

కొనసాగుతున్న సమగ్ర సర్వే

బచ్చన్నపేట : మండలవ్యాప్తంగా సమగ్ర కుటుంబ సర్వే కొనసాగుతోంది. ఆదివారం ఎన్యుమరేటర్లు ఆయా గ్రామాల్లో కుటుంబ సభ్యుల వివరాలను సేకరించారు. కొందరు తమ వ్యక్తిగత విషయాలను చెప్పడం లేదు. జిల్లా వ్యవసాయ అధికారి రామారావు నాయక్, తహసీల్దార్ ప్రకాశ్‌రావు, ఎంపీడీఓ మల్లికార్జున్ సర్వేను పరిశీలించారు.

జఫర్‌గఢ్ : మండలవ్యాప్తంగా సమగ్ర కుటుంబ సర్వే కొనసాగుతోంది. ఒక్కో ఎన్యుమరేటర్ 8 నుంచి 10ఇళ్ల వరకు సర్వే చేస్తున్నారు. సర్వే ఆస్తులు, భూములు, కులాంతర వివాహాలు చెప్పేందుకు ప్రజలు నిరాకరిస్తున్నారు. మండల ప్రత్యేకాధికారి రాధాకిషన్, ఎంపీడీఓ సుమన్, తహసీల్దార్ శంకరయ్య గ్రామాల్లో పర్యటిస్తూ ఎన్యుమరేటర్లకు సూచనలు చేశారు.

ప్రత్యేక చొరవతో సుందరీకరణ పనులు



ఏర్పాట్లను పరిశీలిస్తున్న నాయకులు

లింగాలఘణపురం : జీడికల్ జాతరలో ప్రత్యేక నిధులతో విద్యుత్ లైట్ల సుందరీకరణకు ఏర్పాట్లు చేయడం జరుగుతుందని మాజీ జెడ్పీటీసీ గుడి వంశీధర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం జీడికల్ వీరాచల రామచంద్రుడిని దర్శించుకొని జాతర ఏర్పాట్లపై పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యే శ్రీహరి ప్రత్యేక చొరవతో ఈసారి జాతర భక్తులకు ఇబ్బంది కలుగకుండా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే కడియం శ్రీహరి ప్రత్యేక చొరవతో సుమారు 1.3 కి.మీ. రోడ్డు కంకర వేసి డస్ట్‌పోసి భక్తులకు ఇబ్బంది కలుగకుండా మరమ్మత్తులు చేసినట్లు తెలిపారు. జనగామ మార్కెట్ వైస్ చైర్మన్ శివ కుమార్, దేవస్థాన చైర్మన్ మూర్తి, నాయకులు బిట్ల బాబు, డైరెక్టర్లు మోహన్, నాయకులు నాగేందర్, గణపతి, రాజు తదితరులు పాల్గొన్నారు.

గుంతల పూడ్చివేత



జఫర్‌గఢ్ : మండల కేంద్రం నుంచి హిమ్మత్‌నగర్ మీదుగా సూరారం వెళ్లే రోడ్డు గుంతలుగా మారడంతో వర్ధన్నపేట సీఐ శ్రీనివాస్‌రావు, స్థానిక ఎస్సై రామ్‌చరణ్ ఆధ్వర్యంలో ఆదివారం పూడ్చివేయించారు. వర్ధన్నపేట సీఐ, ఎస్సై తమ సిబ్బందితో పాటు గ్రామస్తుల సహకారంతో టిప్పర్ల ద్వారా గుంతల్లో మొరం పోయించారు. దీంతోపాటు రోడ్డుకు ఇరువైపులా పెరిగిన పిచ్చిమొక్కలను తొలగించారు. గ్రామస్తులు పోలీసులకు అభినందనలు తెలిపారు. మాజీ సర్పంచ్ తాటికాయల అశోక్‌తో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

చెట్ల తీగల తొలగింపు



చిల్పూరు : విద్యుత్ స్తంభాలకు అల్లుకున్న చెట్ల తీగలను ఆదివారం ఇన్‌స్పెక్టర్ నీలం ఐలేష్ ఆధ్వర్యంలో సిబ్బంది తొలగించినట్లు ట్రాన్స్‌కో ఏఈ లక్ష్మీనారాయణ తెలిపారు. మండలంలోని రాజవరం, చిన్నపెండ్యాల, చిల్పూరు సబ్ స్టేషన్‌ల పరిధిలో విద్యుత్ స్తంభాలకు తీగలు అల్లుకోవడంతో తరుచూ విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడగా తీగలను తొలగించారు. కార్యక్రమంలో రాంమూర్తి, విజయ్‌కుమార్, గణేష్, మధురెడ్డి, సురేందర్‌రెడ్డి, కృష్ణంరాజు, రవి, అశోక్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటరమణ

స్టేషన్‌ఘన్‌పూర్ : కల్లుగీత కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కేజీకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మేకపోతుల వెంకటరమణ అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం టీసీఎస్ కమిటీ హాలులో కేజీకేఎస్ మండల అధ్యక్షుడు మాచర్ల రఘురాములు అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి రమణ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న గీత కార్మికుల ఎక్స్‌గ్రేషియాను విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు వెంకటేష్, మండల అధ్యక్షుడు గడ్డం రాజు, గట్టు ఉప్పలయ్య, గట్టు రమేష్, పులి శ్రీను, శ్రీనివాస్, మాచర్ల భిక్షపతి, పొన్నం శ్రీనివాస్, రంగు ప్రభాకర్, వెంకటేశ్వర్లు, బంగ్లా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

దేశ సంపదను దోచిపెడుతున్న మోదీ

- సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి



మాట్లాడుతున్న మోకు కనకారెడ్డి

జఫర్‌గఢ్ : దేశ సంపదను మోదీ ప్రభుత్వం కార్పొరేట్లకు దోచిపెడుతోందని సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి పేర్కొన్నారు. జఫర్‌గఢ్‌లో సీపీఎం మండల మహాసభను ఆదివారం నిర్వహించారు. ఈ మహాసభకు కాట సుధాకర్ అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా కనకారెడ్డి హాజరయ్యారు. ముందుగా గాంధీ సెంటర్ నుంచి మండల మహాసభ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం సభా ప్రాంగణంలో కనకారెడ్డి ఎర్రజెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో నరేంద్రమోదీ ప్రభుత్వం పెట్టుబడిదారులకు అనుకూలమైన విధానాలను అమలు చేస్తూ దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు కట్టబెడుతున్నారన్నారు. నిరుద్యోగులకు ఇస్తామన్న రెండు కోట్ల ఉద్యోగాలు ఎక్కడికి పోయాయని ఆయన ప్రశ్నించారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఏ ఒక్క హామీని అమలు చేయడం లేదన్నారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు రాపర్తి రాజు, ఆర్.సోమయ్య, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కేటీఆర్‌కు ఘన స్వాగతం



జనగామ: కేటీఆర్‌కు స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి, నాయకులు

జనగామ /స్టేషన్‌ఘన్‌పూర్ : హనుమకొండలో ఓ ప్రైవేట్ కార్యక్రమానికి వెళ్తున్న బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు ఆదివారం జనగామ మండలం పెంబర్తి కాకతీయ కళాతోరణం వద్ద ఆదివారం ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, స్టేషన్‌ఘన్‌పూర్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు ఘనస్వాగతం పలికారు. ఈసందర్భంగా పలువురు కేటీఆర్‌ను శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా పెంబర్తి నుంచి జనగామ జిల్లా కేంద్రం ఆర్టీసీ చౌరస్తా అంబేద్కర్ విగ్రహం వద్దకు ర్యాలీగా చేరుకుని నివాళులర్పించారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, ప్రతినిధులు తరలివచ్చారు.

మిత్రుడి కుటుంబానికి ఆర్థికసాయం



కొడకండ్ల: సాయం అందజేస్తున్న ప్రతినిధులు

తరిగొప్పుల : మండలంలోని సోలిపురం గ్రామానికి చెందిన వీఆర్ఏ నందనబోయిన రాజు మృతి చెందగా తోటి స్నేహితులు ఆదివారం ఆర్థికసాయాన్ని అందించారు. 2010–11 పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ. 7వేల నగదును అందించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు గాడి రాజు, శ్రావణ్‌కుమార్, కొండ కుమార్, సుజన్‌కుమార్ పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ చేయూత

కొడకండ్ల : పాలకుర్తి మండలం వావిలాల గ్రామానికి చెందిన అనాథలు వర్షిత్, శ్రీవల్లికి కొడకండ్ల లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో చేయూతనందించారు. రూ.43 వేల ఆర్థికసాయాన్ని ఆదివారం అందజేసినట్లు లయన్స్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు దామెర రవీందర్, గాజుల రాములు, కోశాధికారి నేతి కొండయ్యలు తెలిపారు. ప్రతినిధులు మోడపల్లి సోమన్న, అంజయ్య, ప్రసన్నకుమార్, కొమురెల్లి, రమేష్, ఉపేందర్, సోమన్న, వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సభను జయప్రదం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రకాశ్

జనగామ రూరల్ : పట్టణంలో నిర్వహించే సీపీఎం బహిరంగ సభను జయప్రదం చేయాలని పట్టణ కార్యదర్శి జోగు ప్రకాశ్ కోరారు. ఈ సందర్భంగా ఆదివారం ఆయన మాట్లాడుతూ..పట్టణంలోని నెహ్రూ పార్క్ వద్ద సోమవారం సాయంత్రం సీపీఎం బహిరంగ సభ ఏర్పాటు చేసినట్లు ముఖ్య అతిథులుగా రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఎండీ అబ్బాస్, జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి హాజరవుతారన్నారు. మేధావులు ప్రజలు, కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ కమిటీ సభ్యుడు కళ్యాణం లింగం, బండ సౌందర్య, కొమ్మగళ్ల మణి, ఎర్ర రజిత, పాల్వాయి పద్మ, అంజమ్మ, రజియా, ఏనుగుల కమల పాల్గొన్నారు.

ఐక్యంగా ముందుకు సాగాలి



రఘునాథపల్లి : ఆర్యవైశ్యులు ఐక్యంగా ముందుకు సాగాలని రాష్ట్ర ఆర్యవైశ్య కౌన్సిల్ సభ్యుడు, సర్పంచ్‌ల ఫోరం జిల్లా మాజీ అధ్యక్షుడు పోకల శివకుమార్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని ఆర్యవైశ్య భవన్‌లో శివకుమార్, జోనల్ చైర్మన్ తుమ్మలపల్లి సోమేశ్వర్ ఆధ్వర్యంలో రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణ జన్మదినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేశారు.

వ్యక్తిగత గోప్యతపై వివరణ ఇవ్వాలి

జనగామ రూరల్ : రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కులగణన సర్వేలో వ్యక్తిగత గోప్యతకు నష్టం వాటిల్లే అంశాలు ఉన్నాయని, వాటిపై ప్రభుత్వం వివరణ ఇవ్వాలని సీపీఐ జిల్లా కార్యదర్శి సీహెచ్ రాజారెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సైబర్ నేరాలు పెరుగుతున్న నేపథ్యంలో ఫోన్ నంబరు, ఆధార్, బ్యాంకు ఖాతాలకు సంబంధించిన అంశాలు కోరడంతో ఇవి సైబర్ నేరగాళ్లకు తెలిస్తే నష్టం జరుగుతుందని కొంతమంది ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. కులగణన సర్వేకు ఆస్తులు, అప్పులు, అవసరం ఎందుకని ప్రజలు ప్రశ్నిస్తున్నారని తెలిపారు.కొందరు పూర్తి సమాచారం ఇచ్చేందుకు చాలాఇబ్బంది పడుతున్న పరిస్థితిని ప్రభుత్వం గమనించి, వెంటనే వీటిపై వివరణ ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు.

సంక్షిప్త సమాచారం

జనకళ్యాణ్ దివస్‌ను విజయవంతం చేయండి

జనగామ రూరల్ : జనకళ్యాణ్ దివస్‌ను విజయవంతం చేయాలని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు మడిపడగ చంద్రశేఖర్ అన్నారు. ఆదివారం పట్టణంలో మూడు నియోజక వర్గాల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..మాయావతి పుట్టిన రోజు సందర్భంగా ప్రజల నుంచి సేకరించి విరాళాలను బహుమతిగా అందించాలని నాయకులకు సూచించారు. జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీశైలం, మల్లేష్, ప్రసాద్, అర్జున్, ప్రవీణ్, లావణ్య, రాజు, హరీష్ పాల్గొన్నారు.

ఆహ్వాన పత్రిక అందజేత

చిల్పూరు : మండలంలోని చిన్నపెండ్యాలలో నూతనంగా నిర్మించిన భక్త మార్కండేయ స్వామి బ్రహ్మోత్సవాలకు హాజరు కావాలని కమిటీ నిర్వాహకులు జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డికి ఆదివారం ఆహ్వాన పత్రిక అందజేశారు.

అట్రాసిటి కేసు నమోదు

లింగాలఘణపురం : మండలంలోని కొత్తపల్లికి చెందిన ఎండీ పాషాపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసు నమోదు చేసినట్లు ఎస్సై బండి శ్రావణ్‌కుమార్ ఆదివారం తెలి పారు. ఓ మహిళ పట్ల అసభ్యంగా ప్రవర్తించడంతో ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిదర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

పరామర్శ

స్టేషన్‌ఘన్‌పూర్ : కాంగ్రెస్ పార్టీ వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జ్, స్టేషన్‌ఘన్‌పూర్‌కు చెందిన కొలిపాక సతీష్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదివారం సతీష్ ఇంటికి వచ్చి అతడిని పరామర్శించారు.

చుక్క సత్తయ్యకు నివాళి

లింగాలఘణపురం : మండలంలోని మాణిక్యాపురంలో ఆదివారం చుక్క సత్తయ్య విగ్రహానికి సీనియర్ పాత్రికేయుడు పాశం యాదగిరి, ప్రజాయుద్ధనౌక గద్దర్ కుటుంబ సభ్యులు, జగన్‌రెడ్డితో పాటు పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వీరితో పాటు చుక్క సత్తయ్య కుటుంబ సభ్యులు ఉన్నారు.

దూడపై వీధి కుక్కల దాడి

పాలకుర్తి : మండలంలోని విస్నూరుకు చెందిన సతేంద్ర మహేందర్ యాదవ్ తన వ్యవసాయ పొలం వద్ద కట్టేసిన పాడి గేదెల్లో ఓ దూడపై ఆదివారం వీధి కుక్కలు దాడి చేశాయి. వీధి కుక్కలతో తమ పాడి పశువులకు ముప్పు ఉందని ఆయన ఆవేదన వ్యక్తం చేశాడు.

సభ్యత్వ నమోదు

రఘునాథపల్లి : మండలంలో టీడీపీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు బొక్క రామచంద్రయ్య అన్నారు. ఆదివారం మండలంలోని నిడిగొండలో ఆయన జిల్లా నాయకులతో కలిసి టీడీపీ సభ్యత్వ నమోదును ప్రారంభించారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



లింగాలఘణపురం: కళ్లెం ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థులు



పాలకుర్తి: ఈరవెన్ను ప్రభుత్వ పాఠశాలలో 2007-08 బ్యాచ్ విద్యార్థులు..

జఫర్‌గఢ్ : మండలంలోని కూనూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1984–85 పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు, తిమ్మంపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2010–11 ఎస్సెస్సీ బ్యాచ్‌కి చెందిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలల వేదికగా కలుసుకున్న పూర్వ విద్యార్థులు ఒకరినొకరు అప్యాయంగా పలకరించుకున్నారు. ఈ సందర్భంగా అప్పటి గురువులను శాలువాలు, మెమోంటోలతో ఘనంగా సత్కరించారు. కూనూర్ పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు జైపాల్‌రెడ్డి, రాజిరెడ్డి, చందర్, భూపాల్‌రెడ్డి, రాజమౌళి, తిమ్మంపేట పాఠశాలలో పూర్వ విద్యార్థులు రాజేంద్రప్రసాద్, మంద రాకేష్, గర్వందుల మానస, గురువులు శోభారాణి, శాంతకుమారి, రామకృష్ణ, ప్రమోద్‌రెడ్డి, అశోక్‌రెడ్డి, మల్లికార్జున్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

కళ్లెం ప్రభుత్వ పాఠశాలలో..

లింగాలఘణపురం : మండలంలోని కళ్లెం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2005–06 విద్యా సంవత్సరంలో చదివిన పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. అనంతరం ఒకరినొకరు ఆత్మీయంగా పలుకరించుకొని చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకొని ఆనందపడ్డారు.

ఈరవెన్ను జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో..

పాలకుర్తి : మండలంలోని ఈరవెన్ను గ్రామంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2007–08 విద్యాసంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకుని ఆనందంగా గడిపారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు యాదగిరి, బాలమల్లు, దయాకర్, శిరీష, భాగ్యలక్ష్మి, కుమార్, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.



జఫర్‌గఢ్: కూనూర్ పాఠశాలలో నిర్వహించిన సమ్మేళనంలో పాల్గొన్న విద్యార్థులు



జఫర్‌గఢ్: తిమ్మంపేట పాఠశాలలో..

ప్రమాదకరంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్



రఘునాథపల్లి : మండలంలోని ఇబ్రహీంపూర్‌లో గ్రామ పంచాయతీ, అంగన్‌వాడీ కేంద్రం, ఉన్నత, ప్రాథమిక పాఠశాలలకు వెళ్లే ప్రధాన రహదారిపై ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌తో ప్రమాదం పొంచి ఉంది. మత్తడి వద్ద ఏర్పాటు చేసిన 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ ఎత్తు తక్కువగా ఉండటంతో ఇప్పటికే పలు గొర్రెలు, మేకలు మృత్యువాత పడ్డాయి. నిత్యం విద్యార్థులు వెళ్లే రహదారిపై ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ కంచె ఏర్పాటు చేయాలని విద్యుత్ అధికారులను కోరినా పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌కు గద్దె ఎత్తు పెంచి చుట్టూ కంచె ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.